అక్రమ నల్లా కనెక్షన్లు ఉంటే చర్యలు తప్పవు

విజిలెన్స్ సీఐ సురేశ్

శంషాబాద్ రూరల్, మే 24:అక్రమ నల్లా కనెక్షన్లు ఉంటే చర్యలు తప్పవని వాటర్‌బోర్డు విజిలెన్స్ సీఐ సురేశ్ హెచ్చరించారు. శనివారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మధురానగర్, ఆదర్శనగర్, వెల్లంకిన గర్ కాలనీల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ సురేశ్ మాట్లాడుతూ..వాటర్‌బోర్డు ద్వారా సరఫరా చేస్తున్న నీటితో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మధురనగర్ కాలనీలో ఒక కనెక్షన్ అధికంగా ఉన్నది. కాని వారికి గతంలో అనుమతి ఉన్నట్లు వివరించారు. వారి వద్ద ఉన్న రికార్డులను వాటర్‌బోర్డుకు సమర్పించి వారి నుంచి అనుమతి తీసుకొని బిల్లులు విధిస్తామని చెప్పారు. ఇంటిని బట్టి వారికి తాగునీరు వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నల్లాకు మోటారు బిగిస్తే కఠిన చర్యలు

బండ్లగూడ,మే 24: అక్రమ నీటి చౌర్యానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటుమని జలమండలి మేనేజర్ శ్రావ్యరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉప్పరపల్లి న్యూపైప్డ్స్ కాలనీలో ఓ ఇంట్లో మంచినీటి పైపులైన్‌కు మోటార్ బిగించి నీటి చౌర్యానికి పాల్పడుతున్నాడు. గమనించిన జలమండలి అధికారులు మోటార్‌ను సీజ్ చేశారు. ఆమె మాట్లాడుతూ.. మంచినీటి నల్లాకు మోటార్‌ను బిగించడం ద్వారా ఇతరులకు మంచినీటి సరఫరా తగ్గుతుందన్నారు. నల్లాలకు ఎవరైనా మోటార్లను బిగిస్తే వారికి జరిమానాలతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట వర్కఇన్‌స్పెక్టర్ జావిద్, లైన్‌మెన్ మహేశ్‌సింగ్ ఉన్నారు.

ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏకిలో చేర్చాలి

రాష్ట్రంలోని ముదిరాజులు అత్యంత పేదరికంలో మగ్గుతూ జీవనం సాగిస్తున్నారని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు బీసీ(డీ) నుంచి బీసీ(ఏ)లో చేర్చాలని తెలంగాణ మన ముది రాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుం డాల మదన్‌కుమార్‌ను నియమిస్తూ నియమక పత్రాన్ని అందజేశారు. మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మద్దెల సంతోష్‌తో కలిసి శంకర్ ముదిరాజ్ మాట్లాడారు. ముది రాజ్ కులస్తులు సంఘటి తమై హక్కు లు, రాజ్యాధికార సాధన కోసం ముందడుగు వేయాలని పిలుపు నిచ్చారు. **-హిమాయత్‌నగర్,మే 24**

స్టేషన్ మధురానగర్..ఉన్నది రహ్మత్‌నగర్‌లో..

పోలీస్‌స్టేషన్ ఎక్కడుందో తెలియక మధురానగర్ ప్రాంతంలో వెతుకుతున్న బాధితులు, ఫిర్యాదుదారులు

వెంగళరావునగర్, మే 24 :మీరు ఎంత వెతికినా అది కనిపించదు. ఎందుకంటే అది పక్కనున్న రహ్మత్‌నగర్ డివిజన్‌లో ఉంటుంది కాబట్టి. ఫిర్యాదుదారులు సైతం ఇప్పుడు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఠాణా జాడను గుర్తించేందుకు చెప్పులరిగేలా తిరుగుతున్నారు. మధురానగర్ పోలీస్‌స్టేషన్ కోసం మధురానగర్‌కు వెళ్తే.. ఇక్కడ లేదది.. రహ్మత్‌నగర్‌లో ఉందని చెబుండటంతో బాధితులు ఇటూఅటూ తిరుగుతూ సతమతమవుతున్నారు. మధురానగర్‌లో లేని పోలీస్‌స్టేషన్‌కు మధురానగర్ పోలీస్‌స్టేషన్ అని నామకరణం చేసి రెండేళ్ల కిందట ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిమ్స్‌మే సంస్థకు చెందిన ఈ స్థలాన్ని పోలీసుశాఖకు గతంలో అప్పగించింది. ఇక్కడ అప్పట్లో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానంగా రహ్మత్‌నగర్ పోలీసు ఔట్‌పోస్ట్ ఉండేది. రెండేళ్ల కిందట ఈ ఔట్‌పోస్ట్‌ను మధురానగర్ పోలీసు స్టేషన్‌గా మార్చారు. ఎస్.ఆర్.నగర్‌లోని కొన్ని ప్రాంతాలు, జూబ్లీ

రహ్మత్‌నగర్‌లో ఉన్న మధురానగర్ పోలీస్‌స్టేషన్

హిల్స్‌లోని కొన్ని ప్రాంతాలను ఈ ఠాణా పరిధిలోకి తెచ్చి ఇక్కడ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. పేరుకేమో మధురానగర్ పోలీసుస్టేషన్.. అది ఉన్నది మాత్రం రహ్మత్‌నగర్‌లో.. పోలీస్‌స్టేషన్ చిరునామా తెలియని జనాలు మధురానగర్‌కు వెళ్తే పోలీసుస్టేషన్ ఇక్కడ కాదు.. రహ్మత్‌నగర్‌లో ఉందని తెలుసుకుని ఇటూ అటూ తిరుగలేక బాధితులు సతమతమవుతున్నారు. ఇలాంటి కన్ఫ్యూజన్ పోగొట్టేందుకు ఇటీవల జరిగిన నగర కమిషనరేట్ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఏ ప్రాంతాల్లో ఉండే పోలీస్‌స్టేషన్‌కు అక్కడి పేరే ఉండాలనే ఉద్దేశంలో ఠాణా పేర్లను మార్చారు. సెక్రటేరియట్ పోలీస్ స్టేషన్‌ను లేక్ పోలీస్‌స్టేషన్‌గా పేరు మార్చారు. హుమాయన్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను మెహిదీపట్నం పోలీస్‌స్టేషన్‌గా మారింది. షాహినాయత్ గంజ్ పోలీసు స్టేషన్‌ను గోషామహల్ పోలీస్‌స్టేషన్‌గా మార్చేశారు. కానీ రహ్మత్‌నగర్‌లో ఉన్న మధురానగర్ స్టేషన్ కూడా రహ్మత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌గా మార్చితే.. ప్రజలకు ఈ ఠాణా ఎక్కడుందో సులభంగా తెలిసే అవకాశం ఉంటుందని స్థానికులు చెప్తున్నారు. మరి పోలీసు ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని వినతి



టీజీ జెన్కో సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎస్.హరీశ్‌ను పవర్ ఎంప్లాయీస్ యూనియన్-1535 నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనెలలో సంస్థలో పలువురు ఉద్యోగో విరమణ చేయనున్న సందర్భంగా డీపీసీ అయిన వారందరికీ పదోన్నతి కల్పించాలని సీఎండీని యూనియన్ నాయకులు కోరారు. డాక్టర్ హరీశ్‌ను కలిసిన వాళ్లలో యూనియన్ సెంట్రల్ అధ్యక్షుడు ఎంఏ వజీర్, రాష్ట్ర అధ్యక్షుడు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, సిగ్రా ఆనంద్‌కుమార్, అబ్దుల్ ఖాదర్, సుమధురి, రవి, శ్రీనివాస్, అనంతరెడ్డి తదితరులు ఉన్నారు. **- ఎర్రగడ్డ, మే 24**

సమస్యలు తెలుసుకునేందుకే బస్తీల్లో పర్యటనలు

మైలార్‌దేవ్‌పల్లిలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 24: ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు బస్తీలలో పర్యటిస్తున్నట్లు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు శనివారం జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కలుషిత నీటి సరఫరా రావడం వల్ల నీరుని టెస్టింగ్‌కి పంపించి వ్యర్థ పదార్థాలు కలువకుండా చూడాలని సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మన్మోహన్‌రెడ్డి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, రావుల భాస్కర్, రాజేశ్, బాల్‌రెడ్డి, రవీందర్, అనిల్, రవి, శంకర్‌రెడ్డి, జలమండలి డీజీఎం రేణుక, సూపర్‌వైజర్ లోక్‌నాథ్, రవినాయక్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ముందస్తు అవకాశం

జూన్ 30తో 18 ఏండ్లు నిండనున్న వారికి అడ్వాన్స్ ఆఫర్..
కొత్త ఓటర్లకు ఏడాదిలో 4 సార్లు అర్హత..

జూబ్లీహిల్స్, మే 24:అర్హులకు ఓటు హక్కు కల్పించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో 18 ఏండ్లు నిండిన యువతకు ఏడాదికి ఒకే సారి(జనవరి 1న) ఓటు హక్కు కల్పించిన ఎన్నికల అధికారులు ఇటీవల ఏడాదికి 4 సార్లు ఓటరు నమోదుకు అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో 18 ఏండ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేస్తున్నారు. అంతేకాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగే ఓటరు నమోదులో ఏడాది ముందుగా(17 ఏండ్లకే) ఓటరు నమోదు చేసుకునే సువర్ణవకాశం ఎన్నికల సంఘం కల్పిస్తుంది. ఇందులో భాగంగా ఏడాది ముందుగా ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్న యువతకు 18 ఏండ్లు నిండగానే ఎన్నికల సంఘం ఓటు హక్కు కల్పిస్తుంది. జూన్ 30తో 18 ఏండ్లు నిండనున్న యువతను ఓటరు జాబితాలో చేర్చేందుకు యూసుఫ్‌గూడ సర్కిల్‌లో బీఎల్‌ల ద్వారా అవగాహన కల్పిస్తూ నెల ముందుగానే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో నమోదు ప్రక్రియ చేపడుతున్నారు.

మొబైల్ యాప్‌లో ఓటరు హెల్ప్‌లైన్

జాకియా సుల్తానా, డీసీ, యూసుఫ్‌గూడ

నూతన ఓటరు నమోదు, సవరణలకు మొబైల్ యాప్‌లో జీహెచ్‌ఎంసీ ఓటరు హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంటుంది. ఓటర్ నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన వారు ఏడాది ముందుగా నమోదు చేసుకోవచ్చు. జూన్ 30తో 18 ఏండ్లు నిండనున్న వారికి అడ్వాన్స్ ఆఫర్.. కొత్త ఓటర్లకు ఏడాదిలో 4 సార్లు అర్హత.

యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఓటరు నమోదు చేపడుతున్న ఎన్నికల సిబ్బంది(ఫైల్)

పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ పథకాలు

పారిశుధ్య కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ

జూబ్లీహిల్స్, మే 24: పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని యూసీడీ డీపీఓ వెంకటకిషన్‌రావు పేర్కొన్నారు. శనివారం యూసుఫ్‌గూడాలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఎస్ఎఫ్ఏలతో, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. మహిళా పారిశుధ్య కార్మికులతోపాటు పురుషుల కుటుంబ సభ్యులైన మహిళలను పొదుపు సంఘాలలో భాగస్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్ పరిశీలించిన జోనల్ అధికారులు

జూబ్లీహిల్స్, మే 24: రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో శనివారం శేరిలింగంపల్లి జోనల్ అధికారులు కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి పర్యటించారు. క్రీడాకారులకు ఉపయుక్తంగా ఉండేలా ప్లే గ్రౌండ్‌లో ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేయాలని శుక్రవారం కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన నేపథ్యంలో అధికారులు క్రీడా మైదానంలో సర్వే నిర్వహించారు.

సర్వే అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

బెల్టు షాపులకు అడ్డా.. బోరబండ

ఠాణా పరిధిలో లైసెన్స్‌డ్ బార్‌లకు ఢీటుగా బెల్టు బార్లు
పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

ఎర్రగడ్డ, మే 24:బోరబండ పీఎస్ పరిధిలో మద్యం బెల్టుషాపులకు అడ్డాగా మారింది. ఠాణాకు కూతవేటు దూరంలోనే బెల్టుషాపులను కొందరు దర్జాగా నడుపుతున్నారు. ఇక బంజారానగర్, వినాయకరావునగర్, బాబా సైలానీనగర్ బస్తీల్లో అయితే ఏకంగా లైసెన్స్‌డ్ బార్లకు ఢీటుగా బెల్టుబార్లు వెలిశాయి. షెడ్డులను నిర్మించి మందు బాబుల కోసం బెంచీలు, టేబుళ్లు ఏర్పాటు చేయడం గమనార్హం. నిత్యం 24 గంటలపాటు మద్యం విక్రయించే ఈ బెల్టు షాపుల వైపు ఎక్సైజ్ దృష్టి పెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. బోరబండ ఠాణా పరిధి అమీర్‌పేట ఎక్సైజ్ స్టేషన్ కిందికి వస్తుంది. అటు ఎక్సైజ్, ఇటు పీఎస్ అధికారులు, సిబ్బంది బెల్టు షాపులపై దాడులు చేయడం, చర్యలు తీసుకోవడం పూర్తిగా విస్మరించడం గమనార్హం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలోని మద్యం దుకాణాలపై తరచూ దాడులు జరిపి చట్టపరంగా చర్యలు తీసుకునేవారు. గత ఏడాదిన్నర నుంచి పట్టించుకోవడంలేదు. దీంతో బెల్టు షాపులు బెల్టు బారులుగా మారుతున్నాయి.

వైన్ దుకాణాల నుంచి మద్యం..

నేటి రోజుల్లో లైసెన్స్‌డ్ మద్యం దుకాణాన్ని దక్కించుకోవడం వ్యయంతో కూడుకున్న పని. బెల్టు షాపుల కారణంగా వైన్స్ దుకాణాలపై ప్రభావం పడుతుంది. కానీ బోరబండలో అటు వంటిది ఏమీలేదు. స్థానిక వైన్‌షాప్స్ వాళ్లే బెల్టు వ్యాపారం అడ్డాలకు మద్యాన్ని దర్జాగా తరలిస్తుంటారు. దీని వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా లైసెన్స్‌డ్ వైన్స్ షాప్ వాళ్లు బెల్టు దుకాణాలను నడుపుతున్నారని సమాచారం.

తరచూ ఉద్రిక్తతలు..: బెల్టుషాపుల నిర్వాహకుల ఆగడాలకు హద్దులేదు. రాత్రి 10 మొదలు తెల్లారే వరకు మందు బాబులు హంగామా చేస్తుంటారు. దీని వల్ల స్థానికులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. అదేమని అడిగితే అంతే సంగతులు. బెల్టు దుకాణం నడిపే వారు అక్కడికి వచ్చి స్థానికులను దుర్భాషలాడుతూ దాడికి దిగుతారు. వాళ్ల భయానికి స్థానికులు బయటికి రావటానికి జంకుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

అనుమతి లేకుండా రోడ్డు తవ్వితే జరిమానా

అధికారులపై ఒత్తిడి తెస్తున్న కాంట్రాక్టర్

బంజారాహిల్స్,మే 24: జీహెచ్‌ఎంసీ రోడ్ కటింగ్ అనుమతి తీసుకోకుండా సీవరేజ్ లైన్ కోసం రోడ్డును తవ్వేసిన భవన నిర్మాణదారుడికి భారీ జరిమానా విధించారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని రాడో షోరూమ్ నుంచి ఇన్‌కంటాక్స్ క్వార్టర్స్‌కు వెళ్లేరోడ్డుపై ప్రేమ్‌చంద్ గుప్తా అనే వ్యాపారి భారీ భవన నిర్మాణం చేస్తున్నారు. ఈ భవనానికి సంబంధించిన సీవరేజ్ లైన్ కోసం జల మండలి నుంచి అనుమతి తీసుకున్నారు. జీహెచ్‌ఎంసీ నుంచి రోడ్ కటింగ్ అనుమతులు తీసుకున్న తర్వాత పనులు చేసుకోవాలని సూచించారు. కాగా, స్థానిక జీహెచ్‌ఎంసీ క్షేత్రస్థాయి సిబ్బందితోపాటు కొంతమంది లీడర్లతో డీల్ మాట్లాడుకున్న జలమండలికి చెందిన కాంట్రాక్టర్ శివకుమార్ జీహెచ్‌ఎంసీ నుంచి రోడ్ కటింగ్ అనుమతులు తీసుకోకుండా సుమారు 20 మీటర్ల మేర రోడ్డును తవ్వేసి సీవరేజ్ లైన్ పనులు చేపట్టారు. కాగా, ఈ వ్యవహారాన్ని స్థానికులు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పనులు ఆపేయించడంతోపాటు అక్రమంగా వేసిన పైప్‌లైన్లను తొలగించారు. ఈ వ్యవహారంపై జలమండలి అధికారులు సమగ్ర విచారణ చేపట్టగా.. జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకున్న తర్వాతనే పనులు చేయాల్సిన కాంట్రాక్టర్ అనధికారికంగా రోడ్డు తవ్వేసి పనులు చేయించినట్లు తేలింది. ఈ మేరకు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని జలమండలి అధికారులు సిఫార్సు చేశారు. ఇదిలా ఉండగా.. ఎలాంటి అనుమతులు లేకుండా జీహెచ్‌ఎంసీకి చెందిన రోడ్డును తవ్వేసిన భవన నిర్మాణదారుడిపై ఇంజినీరింగ్ విభాగం భారీ జరిమానా వేశారు. రోడ్డు కటింగ్ చార్జీలు, ల్యాండ్ లీజ్ చార్జీలతోపాటు 50శాతం పెనాల్టీని కలిపి రూ.3,17,965 చెల్లించాలంటూ తాజాగా నోటీసులు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకోకుండా అక్రమంగా పనులు చేసిన జలమండలి కాంట్రాక్టర్‌కు మద్దతుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన ఓ కార్పొరేటర్ రంగంలోకి దిగడంతోపాటు జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలుస్తున్నది. ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్టర్ సైతం అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు కాంట్రాక్టర్‌కు సహకరించిన జీహెచ్‌ఎంసీ క్షేత్రస్థాయి అధికారి పాత్రపై కూడా విచారణ కొనసాగుతున్నది.

బంజారాహిల్స్ రోడ్ నం.12లో అనుమతి లేకుండా వేసిన సీవరేజ్ పైపులను తొలగిస్తున్న దృశ్యం(ఫైల్)

శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయం అడ్మిన్‌స్ట్రేటివ్ అధికారిగా రంగారావు

బండ్లగూడ, మే 24: బండ్లగూడ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయం అడ్మిన్‌స్ట్రేటివ్ అధికారిగా కెప్టెన్ కె.వెంకటరంగారావును నియమించినట్లు విద్యారణ్య ఆవాస విద్యాలయము అధ్యక్షుడు గోకరి అర్జున్‌గౌడ్, కార్యదర్శి బోడ్డు శ్రీనివాస్ తెలిపారు. వెంకటరంగారావు ఆర్మీ విద్యారంగంలో అనేక సేవలందించారన్నారు. విద్యారణ్య ఆవాస విద్యాలయంలో విద్యార్థుల భవిష్యత్తును మరింత మెరుగుపర్చేందుకు ఆయనను నియమించినట్లు వారు వివరించారు.

గిరిప్రసాద్ సేవలు మరువలేనివి

హిమాయత్‌నగర్‌లో గిరిప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

హిమాయత్‌నగర్, మే 24: సమాజానికి, పార్టీకి తెలంగాణ సాయుధ పోరాటయోధుడు నల్లమల గిరిప్రసాద్ అందించిన సేవలు మరువలేనివని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా అన్నారు. గిరిప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం ఆవరణంలో గిరిప్రసాద్ చిత్రపటానికి పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. అజీజ్ పాషా మాట్లాడుతూ అట్టడుగు స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు ఎదిగిన గిరిప్రసాద్ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలకొండ కాంతయ్య, నేతలు రాజ్‌కుమార్, నదీమ్, గోవింద్, శ్రీరాములు, దశరథ, నరసింహ పాల్గొన్నారు.

8న లింగాయత్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం యువజన విభాగం ఆధ్వర్యంలో జూన్ 8న బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో పదిలో ఉత్తమ మార్కులు సాధించిన లింగాయత్ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల సంగమేశ్వర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గౌరవ అధ్యక్షులు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప, కేంద్ర కమిటీ సభ్యులు శెట్టి శివకుమార్, రాష్ట్ర కోశాధికారి కక్షపల్లి రాచప్పతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ బీబీ పాటి గ్రూప్‌పాటు లింగాయత్ ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. సంఘం జీహెచ్‌ఎంసీ అధ్యక్షులు పట్లోళ్ల శివచరణ్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు పెద్దపట్ల భరత్, విశ్వనాథ్, పరమేశ్వర్, మధు పాల్గొన్నారు. **- ఖైరతాబాద్**

ఆధ్యాత్మిక, సామాజిక సేవ చేయడం అభినందనీయం

సహస్రాపధాని మాడుగుల నాగఫణిశర్మను సన్మానిస్తున్న ప్రణవ భక్త సమాజం సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 24: వందేళ్ల నుంచి నిరాటంకంగా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం అందరికీ మార్గదర్శకంగా నిలిచిందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, సహస్రాపధాని మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. శనివారం ప్రణవ భక్త సమాజం ఏక శతపంచోత్తర మహోత్సవాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రణవం అంటే ఓంకారమని, ఓంకారంలోనే సృష్టి అంతా ఇమిడి ఉందన్నారు. అంత గొప్ప పదంతో ఆధ్యాత్మిక బంధం ఏర్పరచుకున్న ప్రణవ భక్త సమాజం నిజంగా గొప్ప సంస్కృతికి శ్రీకారం చుట్టిందని ప్రశంసించారు. ఈ సందర్భంగా సమాజం సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. శతాబ్ది ఉత్సవాల్లో రెండవ రోజు శంకరానందగిరి స్వామి, వీరానంద బ్రహ్మచారి ప్రవచనాలు చేసి ప్రజలను ఆలోచింపజేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ క్యాస్టోరెడ్డి, అత్తాపూర్ సీఐ నాగేశ్వరరావు, సమాజం అధ్యక్షులు మోండ్ర నర్సింహ, పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి, కొండమీది హరినాథ్, ఎస్.బి.హరినాథ్, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, కొలన్ సుభాష్‌రెడ్డి, మ్యాడం రామేశ్వరరావు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

తాను మరణిస్తూ జీవనదానం

రాజశేఖర్(ఫైల్)

ఖైరతాబాద్, మే 24 : ఓ యువకుడు తాను మరణించినా ఐదుగురికి జీవనదానం చేశాడు. జీవన్‌దాన్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపిన ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా వేంనూరు మండలం, చెన్నకిష్టాపూర్‌కు చెందిన అజ్మీరా రాజశేఖర్(21) డిగ్రీ చదువుతున్నాడు. ఈనెల 21న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన రాజశేఖర్ను నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈనెల 23న బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబసభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. కాలేయం, రెండు మూత్రపిండాలు, కార్నియాలను సేకరించారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం

శనైశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తదితరులు

శంషాబాద్ రూరల్, మే 24: శని ప్రయోదశి సందర్భంగా శనీశ్వరుడికి శనివారం తైలాభిషేకం కార్యక్రమం మండలంలోని మదన్‌పల్లి గ్రామంలోని శనైశ్వరస్వామి ఆలయ ట్రస్టు చైర్మన్ శంకరరాజు ముఖీయా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనీశ్వర దేవుడిని ఆరాధించడంతో ప్రజల జీవితంలో శనిదోషాలు పోతాయని గుర్తు చేశారు. శని ప్రయోదశి సందర్భంగా శనీశ్వరుడికి తైలాభిషేకం చేయడంతో కీర్తి ఐశ్వర్యం లభిస్తుందని వివరించారు. స్వామివారికి పూజలు నిర్వహించిన వారికిలో మాజీ జడ్పీటీసీ తన్వీరాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల్, చంద్రారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, మోహన్‌నాయక్, శ్రీకాంత్‌గౌడ్‌లతో పాటు పలువురునాయకులు భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీఐ కమిషనర్‌గా బైపాల్‌ను నియమించడం అభినందనీయం

బండ్లగూడ,మే 24: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీఐ కమిషనర్‌గా దేశ పాల బైపాల్‌ను నియమించడం అభినందనీయమని రాజేంద్రనగర్ జై భీమ్ జైరామ్ జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు ఎడ్లకాడి సూర్యం పేర్కొన్నారు. దేశపాల భూపాల్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూపాల్ న్యాయ వృత్తిలో అనేక మంది బడుగు బలహీన వర్గల వారికి సేవలందించారని కొనియాడారు. ఆయన చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి ఆర్టీఐ కమిషనర్‌గా నియమించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ కమిషనర్ దేశపాల భూపాల్‌ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులు

ఓయూలో బ్యాక్‌లాగ్స్ విద్యార్థులకు వన్‌టైం అవకాశం

సికింద్రాబాద్, మే 24: ఓయూలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్ డబ్ల్యూ చదివి బ్యాక్‌లాగ్స్ ఉన్న విద్యార్థులకు వన్ టైం అవ